




మిఠాయిలు తినిపించుకుంటున్న అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు

టెక్కలిలో సంబరాలు

టెక్కలి, మార్చి 22: శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థిగా టీడీపీ అధిష్ఠానం సిటింగ్ ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడును ప్రకటించడంతో పార్టీ శ్రేణులు, అభిమానుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. టెక్కలి మండలం బన్నువాడలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడులు పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్‌చేసి సంబ రాలు చేసుకున్నారు. తమ విజయాలను ఎవరూ అడ్డుకోలే రని అచ్చెన్న, రామ్మోహన్‌నాయుడు స్పష్టం చేశారు. మూ డోసారి ఎంపీగా పోటీ చేయడానికి అవకాశం కల్పించిన చంద్రబాబుకు రామ్మోహన్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బగాది శేషగిరిరావు, మెండ దాసునాయుడు, వినోద్, బసవల అప్పలస్వామి, వట్టికూళ్ల రామకృష్ణ, మురళీ, వట్టికూళ్ల తిరుమలరావు ఉన్నారు.

మూడో జాబితాలో.. మరో ముగ్గురు

- టీడీపీ అభ్యర్థుల ఖరారు ● పలాస గౌతు శిరీషకే..
- శ్రీకాకుళం - గొండు శంకర్, పాతపట్నం - మామిడి గోవింద్‌కు టికెట్ల కేటాయింపు
- ఎంపీ అభ్యర్థిగా రామ్మోహన్‌నాయుడు
- ఎచ్చెర్లపై కొనసాగుతున్న ఉత్కంఠ





గౌతు శిరీష



గొండు శంకర్



మామిడి గోవిందరావు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ మూడోవిడత అభ్యర్థు ల జాబితాను శుక్రవారం ప్రకటించింది. ఇందులో భాగంగా శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి, అలాగే పలాస, శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేస్తూ జాబితా వెల్లడించింది. శ్రీకాకుళం పార్ల మెంట్ అభ్యర్థిగా ప్రస్తుత ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడిని ఖరారు చేసింది. దివంగత కేంద్రమాజీ మంత్రి కింజ రాపు ఎర్రన్నాయుడు కుమారుడిగా రామ్మోహన్‌నాయుడు రాజకీయప్రవేశం చేశారు. టీడీపీ నుంచే 2014లోనూ, 2019లోనూ ఎంపీగా గెలుపొందారు. యువ ఎంపీగా పార్లమెంట్‌లో శ్రీకాకుళం వాణిని వినిపిస్తూ గుర్తింపు పొందారు. మూడోసారి ఎన్నికల బరిలో దిగేందుకు సన్నద్ధమవుతున్నారు.

● పలాస గౌతు కుటుంబానికే...

పలాస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా గౌతు శిరీషను అధిష్ఠానం ఖరారు చేసింది. పలాస నియోజకవర్గం ఇటీవల ప్రాచుర్యం పొందింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇక్కడ గౌతు శిరీషపై, టీడీపీ కేడర్‌పై అధికార పార్టీ వేధింపులు అధికమయ్యాయి. కేసులు నమోదు.. ఆపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. వాట న్నింటినీ తట్టుకుని పార్టీని నడిపిస్తూ.. వైసీపీ ఢీకొంటూ శిరీష తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. రాజకీయపరంగా తండ్రి మాజీమంత్రి గౌతు శివాజీ, తాత సర్దార్ గౌతు లచ్చన్న వారసురాలిగా గుర్తింపు పొందారు. 2019 ఎన్నికల్లో ప్రజలు జగన్‌కు ఇచ్చిన ఒక్క ఛాన్స్ వల్ల.. పలాస టీడీపీ అభ్యర్థిగా శిరీష ఓటమి చెందారు. తాజాగా అధిష్ఠానం మళ్లీ టికెట్ కేటాయించడంతో.. ఇప్పుడు రెట్టింపు ఉత్సాహంతో పోటీ చేయనున్నారు.

● ఆ రెండు చోట్లా యువతకు ప్రాధాన్యం

టీడీపీ ఈ దఫా ఎమ్మెల్యే అభ్యర్థుల సీట్ల కేటాయింపులో యువతకు ప్రాధాన్యం ఇస్తామని ముందే చెప్పింది. ఈ మేరకు శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాలను యువతకే కేటాయించింది. శ్రీకాకుళం నియోజకవర్గ అభ్యర్థిగా గొండు శంకర్‌ను, పాతపట్నం అభ్యర్థిగా మామిడి గోవింద్‌ను ప్రకటించింది. జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, శ్రీకాకుళం మండలం కృష్ణప్పపేట సర్పంచ్ గొండు శంకర్ కొన్నాళ్ల నుంచి టీడీపీలో చురుగ్గా ఉంటున్నారు. పార్టీ కార్యక్రమాలతోపాటు.... వైసీపీని ఎదుర్కొనే విషయంలో దుందుడుకుగానే వెళ్లి టీడీపీ పెద్దల నుంచి కూడా గుర్తింపు పొందారు. యువత కోటాలో తనకు శ్రీకాకుళం అసెంబ్లీ టిక్కెట్ కేటాయించాలని అధిష్ఠానాన్ని శంకర్ కోరారు. శ్రీకాకుళం విషయమై ఒకటికి రెండు దఫాలు సర్వేలు నిర్వహించి గొండు శంకర్‌ను శ్రీకాకుళం అభ్యర్థిగా ఎట్టకేలకు ఖరారు చేస్తూ అధిష్ఠానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో పలువురు గొండు శంకర్‌కు అభినందనలతో ముంచెత్తారు. పార్టీ కోసం అందరినీ కలుపుకొని వెళ్తానని.. తన రాజకీయ తొలి గురువులు గుండ దంపతులేనని.. యువతకు పార్టీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని గొండు శంకర్ తెలిపారు.

ఇక పాతపట్నం నియోజకవర్గంలో వైసీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. వంశధార నిర్వాసితులకు 2013 నాటి భూసేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ ఇస్తామని 2019 ఎన్నికల్లో జగన్మోహనరెడ్డి ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం ప్యాకేజీ చెల్లించలేదు. హిరమండలం జడ్పీటీసీ అభ్యర్థిగా పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయుడు వైసీపీ నుంచి బరిలో నిల్చున్నా.. ప్రజలు టీడీపీ అభ్యర్థిని గెలిపించారు. రాష్ట్రంలో ఒకే ఒక్క జడ్పీటీసీ టీడీపీకి లభించింది ఇక్కడే. ఈ ప్రాంతంలో టీడీపీకి పట్టుపెరిగింది. ఇక్కడ నుంచి సామాజిక కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లో పట్టుపెంచుకున్న మామిడి గోవిందరావు టీడీపీ తరఫున చాన్నాళ్ల నుంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈసారి తనకు టికెట్ కేటాయించాలని అధిష్ఠానానికి విన్నవించారు. ఇక్కడ కూడా శ్రీకాకుళం మాదిరిగానే సర్వే చేసి మామిడి గోవిందరావును అధిష్ఠానం ఖరారు చేసింది. చాన్నాళ్ల నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలన్న గోవిందరావు కోరిక నెరవేరింది. 'టికెట్ దక్కడం పూర్వజన్మ సుకృతం. ఇందుకు టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు కృతజ్ఞతలు. అందరి సహకారంతో విజయం సాధిస్తాను. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి ఆశీస్సులు సైతం తీసుకుంటాను. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తా'నని మామిడి గోవిందరావు తెలిపారు.

● ఎచ్చెర్ల.. ఎటూ తేల్చలే..

జిల్లాలోని ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం.. విజయనగరం పార్లమెంట్ పరిధిలో ఉంది. ఈ నియోజకవర్గానికి సంబంధించి టికెట్ కేటాయింపుపై ఉత్కంఠ కొనసాగుతోంది. టీడీపీ నుంచి మాజీమంత్రి కిమిడి కళావెంకటరావు, కలిశెట్టి అప్పలనాయుడు, బీజేపీ నుంచి నడుకుదిటి ఈశ్వరరావు టికెట్ ఆశిస్తున్నారు. ఇప్పటికే పలు దఫాలు టీడీపీ అధిష్ఠానం సర్వేలు చేసింది. మొన్నటి వరకు టీడీపీ అభ్యర్థి పరిశీలనలో ఉండగా.. ఇప్పుడు పొత్తుల నేపథ్యంలో బీజేపీ అభ్యర్థికే టిక్కెట్ ఇవ్వాలంటూ పట్టుబట్టడంతో ఇక్కడ ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో ఈ ఒక్కటి మినహా అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఖరారయ్యారు. టీడీపీ నుంచి ఇప్పటికే ఇచ్ఛాపురం- బెందాళం అశోక్, టెక్కలి- కింజరాపు అచ్చెన్నాయుడు, ఆమదాలవలస - కూన రవికుమార్, నరసన్నపేట- బగ్గు రమణమూర్తి పేర్లను తొలి, రెండోవిడత జాబితాలో ఖరారైన విషయం తెలిసిందే. ఎచ్చెర్లపై ఎప్పుడు ఉత్కంఠ వీడుతుందోనని ఆశావహులు ఎదురుచూస్తున్నారు.



వైసీపీ ప్రచారంలో రేషన్ డీలరు

మందస మేజరు పంచాయతీలో రేషన్ డీలర్ చెరకుపల్లి లక్ష్మణరావు వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ మేరకు ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ నాయకులు మందస తహసీల్దార్ తిరుమలబాబుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా డీలరు పాల్గొని కరపత్రాలతో ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

\- మందస

కోడ్ ఉల్లంఘించే వారిపై కేసులు

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- అభ్యర్థులకు సువిధ ద్వారానే అనుమతులు
- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, మార్చి 22: 'ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలి. కోడ్ ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాల'ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నోడల్, రిటర్నింగ్ అధికారులు, ఎంసీసీ అమలు బృందాలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 'ఎంసీసీ, ఎన్నికలకు సంబంధించిన అన్ని రకాల బృందాలు సంబంధిత ఆర్‌ఓ కిందనే పనిచేయాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో కోడ్ ఉల్లంఘన సంఘటనలకు స్థానిక అధికారులే బాధ్యత వహించాలి. ఎన్నికల సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు, ప్రచారం, వాహనాలు తదితరాలకు అనుమతులు తప్పనిసరి. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు స్వీప్ కార్యాక్రమాన్ని ముమ్మరం చేయాలి. ఓటరు కార్డుల పంపిణీ శతశాతం పూర్తి కావాలి. సి-విజిల్ బృందాలు అప్రమత్తంగా ఉండాలి' కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేసీ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్డీవో రంగయ్య, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రాణీమోహన్, సీపీవో ప్రసన్నలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆడిట్ అధికారి సుల్తానా, సెబ్ అధికారి తిరుపతిరావు, ఔషధ నియంత్రణ శాఖాధికారి చంద్రరావు, సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, సమాచార, పౌర సంబంధాల అధికారి కె.చెన్న కేశవరావు, గడ్డెమ్మ, ఓబులేసు, నగేష్, చిట్టిరాజు పాల్గొన్నారు.

అభ్యర్థులకు కొత్త బ్యాంకు ఖాతాలు

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా కొత్త బ్యాంకు ఖాతాలను తెరవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల వ్యయ పర్యవేక్షణకు సంబంధించి జేసీ నవీన్‌తో కలిసి జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'నామినేషన్‌కు ఒకరోజు ముందు కూడా అభ్యర్థులు తమ పేరున లేదా ఏజెంట్‌తోపాటు జాయింట్ ఖాతాలు ఏదైనా బ్యాంకు (సహకార బ్యాంకులతో సహా) లేదా పోస్టాఫీసులో తెరవచ్చు. అభ్యర్థుల కోసం అన్ని బ్యాంకులు ప్రత్యేక కౌంటర్ తెరిచి, ప్రాధాన్యతా ప్రాతిపదికన ఖాతాలో డిపాజిట్, ఉపసంహరణకు అనుమతించాలి. బ్యాంకుల నుంచి పెద్ద ఎత్తున నగదు లావాదేవీలపై పూర్తిగా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. అనుమానాస్పద లావాదేవీలు జరిగితే బ్యాంకులు జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం ఇవ్వాలి. రూ.10లక్షల కంటే ఎక్కువ విత్‌డ్రా అయితే డీఈవోకు సమాచారం ఇవ్వాలి' తెలిపారు. సమావేశంలో డీఆర్వో ఎం.గణపతిరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్యకిరణ్, యూనియన్ బ్యాంకు ఆర్ఎం ఎంవీ.తిలక్, డీసీసీబీ సీఈవో వరప్రసాద్, గ్రామీణ వికాస్ బ్యాంకు ఆర్ఎం రాఘవేంద్ర, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



కారును తనిఖీ చేస్తున్న అధికారులు

బెండిగేటు వద్ద తనిఖీలు

- రూ.2.70 లక్షలు స్వాధీనం

వజ్రపుకొత్తూరు, మార్చి 22: వజ్రపుకొత్తూరు మండలం బెండిగేటు జాతీయరహదారి ఫ్లైఓవర్ వద్ద గురువారం రాత్రి ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాలు తనిఖీ చేశారు. ఓ కారులో రూ.2.70లక్షలను స్వాధీనం చేసుకున్నారని ఎస్ఐ సీహెచ్ రామారావు తెలిపారు. నీలంరంగుల ర్యాలీ రాజుకు చెందిన కారులో గుర్తించిన ఆ నగదుకు సంబంధించిన ఓచర్లు జత కాలేదన్నారు. దీంతో నగదు స్వాధీనం చేసుకుని వజ్రపుకొత్తూరు పోలీసుస్టేషన్‌కు అప్పగించారని తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



భాస్కరరావును ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



భాస్కరరావు (ఫైల్)

ఆదిత్యుడి దర్శనానికి వచ్చి..

- విశ్రాంతి ఉపాధ్యాయుడు హఠాన్మరణం

అరసవల్లి/ నరసన్నపేట, మార్చి 22: అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దర్శనానికి వచ్చిన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు హఠాత్తుగా కుప్పకూలి మరణించాడు. నరసన్నపేటలోని మారుతీనగర్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు యూ.వెంకట భాస్కరరావు(76).. తన భార్య కృష్ణవేణితో కలిసి శుక్రవారం ఉదయం 9గంటల సమయంలో ఆదిత్యుడి దర్శనానికి వచ్చారు. సెల్‌ఫోన్‌ను క్లాక్‌రూమ్‌లో ఉంచి, బయటకు వచ్చిన ఆయన హఠాత్తుగా కింద పడిపోయారు. వెంటనే భార్యతోపాటు సెక్యూరిటీ సిబ్బంది ఆయనను పైకి లేవనెత్తే ప్రయత్నం చేశారు. 108 వాహనానికి సమాచారం అందజేశారు. ఈ లోగా ఓ ఆర్ఎంపీని తీసుకువచ్చి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం 108 వాహనంలో స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే గుండెనొప్పితో ఆయన ప్రాణాలు కోల్పోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో భార్య కృష్ణవేణి బోరున విలపించారు. భాస్కరరావుకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఒడిశా నుంచి సికింద్రాబాద్‌కు..

- గంజాయి రవాణా చేస్తూ ఇద్దరి అరెస్టు



పోలీసులకు గంజాయితో పట్టుబడిన బీహార్ వాసులు

పలాస, మార్చి 22: ఒడిశా రాష్ట్రం నుంచి పలాస రైల్వేస్టేషన్ మీదుగా సికింద్రాబాద్‌కు గంజాయిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఇద్దరిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 60కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి రైల్వే సీఐ కె.వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్నికల వేళ శుక్రవారం పలాస రైల్వేస్టేషన్‌లో అనుమానిత ప్రయాణికుల బ్యాగులు రైల్వే పోలీసులు తనిఖీలు చేశారు. గుణుపూర్ నుంచి పలాస వచ్చే రైలులో బీహార్ రాష్ట్రం భీజలగానియా గ్రామానికి చెందిన ఎండీ షంషేర్, అదే రాష్ట్రం జవహర్‌పూర్ గ్రామానికి చెందిన ఎండీ షమీమ్ 10 కిలోల చొప్పున ప్యాక్ చేసి మొత్తం 60 కిలోల గంజాయిని పట్టుకొని రైల్వేస్టేషన్‌లో దిగారు. వారు పట్టుకున్న బ్యాగులు బరువుగా ఉండడం, అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో రైల్వే పోలీసులు ఆ బ్యాగులు తనిఖీ చేశారు. దీంతో గంజాయి రవాణా బయట పడింది. గంజాయి ఎక్కడిదని పోలీసులు ఆరా తీయగా.. ఒడిశాలోని ఆర్.ఉదయగిరిలో కొనుగోలు చేసినట్లు నిందితులు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ ఎస్‌కె. షరీఫ్, హెచ్‌సీ కోదండ రావు, ఎం.సంతోష్ కుమార్, బి.దేవేంద్రనాథ్, పి.రమేష్‌బాబు, బి.శ్రీనివాసరావు, టి.తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు?

- రూ.147 కోట్ల మేర ధాన్యం బకాయిలు ● 60 రోజులుగా రైతుల పడిగాపులు



ధాన్యం కొనుగోలు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది(ఫైల్)

(టెక్కలి)

రైతులు ధాన్యం ఇచ్చిన 20రోజుల నుంచి 27 రోజుల్లో వారి ఖాతాల్లో నగదు జమవుతుందని రైతుభరోసా కేంద్రాల పరిధిలో నాడు పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో బ్యానర్లు వెలిశాయి. కానీ ధాన్యం విక్రయించి.. రెండు నెలలు గడుస్తున్నా తమ ఖాతాల్లో నగదు జమకావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంకెన్నాళ్లు ఎదురుచూడాలని అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పౌరసరఫరాల అధికారులు 4.46 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రైతులకు సుమారు రూ.147 కోట్లు మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. రైతుభరోసా కేంద్రాల పరిధిలో జనవరి 20 తరువాత ఎఫ్‌టీవోలు జనరేట్ చేసినా.. రైతుల ఖాతాల్లో ఇప్పటికీ నగదు జమకాలేదు. సంబంధిత అధికారులు అదిగో, ఇదిగో కాలయాపన చేస్తున్నారు. ఆర్బీకేల పరిధిలో బయోమెట్రిక్ వేస్తే తప్ప రైతుల ఖాతాల్లో నగదు జమకాదని గ్రామీణ వ్యవసాయ సహాయకులు మెలిక పెట్టారు. దీంతో ఆర్బీకేలకు వెళ్లి బయోమెట్రిక్ వేసినా.. ధాన్యం నగదు మాత్రం జమకాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించి బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు. ఈ విషయమై సివిల్ సప్లైస్ డీఎం శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా రెండురోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని తెలిపారు.

శ్రీముఖలింగంలో కామదహనోత్సవం

దక్షిణకాశీగా ప్రసిద్ధి పొందిన జలుమూరు మండలంలోని శ్రీముఖలింగంలో శుక్రవారం రాత్రి కామదహనోత్సవం నిర్వహించారు. ఉదయం ముఖలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి ఉత్సవ మూర్తులను పల్లకిలో వేంచేపు చేసి గ్రామ పురోహితుడు బంకుపల్లి భూషణశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామ శివారులోని ఉన్నత పాఠశాల వరకు తిరువీధి నిర్వహించి అక్కడ కామదహనం కార్యక్రమం చేపట్టారు. ఏటా శ్రీకూర్మంలో కామదహనం చేపట్టిన రోజే ఇక్కడా నిర్వహించడం ఆనవాయితీ అని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు నారాయణమూర్తి, సింహాచలం, శేషాద్రి వెంకటాచలం, అప్పారావు, శ్రీకృష్ణ, శివ, దేవాలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

\- జలుమూరు



వైసీపీ హయాంలో మత్స్యకారులకు అన్యాయం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు
- మద్దిలోడిపేట వైసీపీకి చెందిన 20 కుటుంబాలు టీడీపీలో చేరిక

టెక్కలి, మార్చి 22: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు అన్యాయం జరిగిందని, ఐదేళ్ల వైసీపీ పాలనకు రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నందిగాం మండలం తామరాపల్లి పంచాయతీ మద్దిలోడిపేటకు చెందిన కొంకి సింహాచలం, శ్రీరాములు, సత్యం, ఈశ్వరరావు, మేఘనాథం, బాలకృష్ణ, లావేటి ప్రసాద్, హేమారావు తదితర 20 కుటుంబాలు, సంతబొమ్మాళి మండలం భావనపాడుకు చెందిన నీలాపు రాజు తదితరులు శుక్రవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి అచ్చెన్న ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందంటే అది టీడీపీ హయాంలోనేనని అన్నారు. ఇది అప్పటి సీఎం చంద్రబాబు చలవేనన్నారు. తీరప్రాంతంలో మత్స్యకారుల అభివృద్ధి ఈ ఐదేళ్లలో అధికార పార్టీకి పట్టలేదని, మత్స్యకారులకు సంబంధించి పలు పథకాలు దూరం చేశారన్నారు. వైసీపీ అధికారం లోకి వచ్చిన తరువాత భూకబ్జాలు, ఇసుక, మైనింగ్ మాఫియాలు, గంజాయి, ఎర్ర చందనం అక్రమ రవాణాలకు కేరాఫ్‌గా రాష్ట్రం తయారైందని విమర్శించారు. పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలన గ్రామాల్లో తెలియజేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నందిగాం, టెక్కలి మండలాల పార్టీ అధ్య క్షులు పినకాన అజయ్‌కుమార్, బగాది శేషగిరి, నేతలు కింజరాపు హరిప్రసాద్, మెండ దాసునాయుడు, కింగ్, కామేసు, అబ్బాసు, రామకృష్ణ, రాము, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి: టీడీపీలో చేరిన మద్దిలోడిపేటకు చెందిన వైసీపీ నేతలతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు

టీడీపీలోకి సుబ్రమణ్యపురం వైసీపీ నేతలు

నరసన్నపేట/ జలుమూరు: జలుమూరు మండలం సుబ్రమణ్యపురానికి చెందిన మాజీ సర్పంచ్ కూన సత్యం, ఉప సర్పంచ్ యడ్ల భూలోకతో పాటు సుమారు 200 కుటుంబాలు శుక్రవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి పార్టీల అభ్యర్థి బగ్గు రమణ మూర్తి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కూన సత్యం మాట్లాడుతూ.. తామంతా గ్రామాభివృద్ధి కోసం బగ్గు రమణమూర్తి వెంట ఉంటామన్నారు. పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యులు కూన కసవయ్య మామిడి సోమేశ్వరరావు, గురుబిల్లి రాములమ్మ, సింగూరు కోటేశ్వరరావుతో పాటు 200 కుటుంబాలున్నాయి. కార్యక్రమంలో జలుమూరు మండల టీడీపీ అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, ప్రధాన కార్యదర్శి బగ్గు గోవిందరావు, నాయకులు రోణంకి కృష్ణంనాయుడు, దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రరావు, బైరి భాస్కరరావు, సింగూరు అమ్మినాయుడు, గుండ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి సాగనంపండి

నరసన్నపేట: ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చిన సీఎం జగన్‌ను ఇంటికి సాగనంపాలని ఉమ్మడి పార్టీల నరసన్నపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి కోరారు. శుక్రవారం నరసన్నపేట పట్టణంలోని జగన్నాథపురం ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కింజరాపు రామారావు, మాజీ సర్పంచ్‌లు ఉణ్న రాజశ్రీ, గొద్దు చిట్టిబాబు, పీస కృష్ణ, జామి వెంకటావు, నేతింటి విశ్వేశ్వరరావు, సీతాపతి తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట: టీడీపీ చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

గౌతు శిరీషకు టికెట్ ప్రకటనపై సంబరాలు

- శివాజీ, వెంకన్న చౌదరిలను అభినందించిన టీడీపీ క్యాడర్
- పలాసలో పార్టీ జెండా ఎగురవేస్తామని శపథం



వెంకన్నచౌదరికి పుష్పగుచ్ఛం ఇస్తున్న టీడీపీ నేతలు

పలాస: పలాస నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషను అధిష్ఠానం ప్రకటించడంపై ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తంచేశాయి. ఈ మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. పలాస నియోజకవర్గ సమన్వయకర్త, శిరీష భర్త వెంకన్న చౌదరికి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు. శిరీషకు టిక్కెట్ దక్కదని వైసీపీ నేతలు విష ప్రచారం చేశారని, ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని పార్టీ నాయకులు ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి శిరీషను గెలిపించడం ద్వారా పలాస నియోజకవర్గంలో పార్టీ జెండాను ఎగుర వేస్తామని శపథం చేశారు. శిరీషను విమర్శించే నాయకులకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంకాల రవిశంకర్ గుప్తా, గురిటి సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, కార్యదర్శి సప్ప నవీన్, జోగ మల్లి, ఎ.రామకృష్ణ, కె.సత్యం, దడియాల నర్సింహులు, డొక్కరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరులో..

వజ్రపుకొత్తూరు: టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషను అసెంబ్లీ పార్టీ అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించడంతో మండలంలో ఆ పార్టీ క్యాడర్ సంబరాలు జరుపుకున్నారు. మిఠాయిలు తినిపించు కుంటూ ఆనందం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి గౌతు శివాజీ, పలాస సమన్వయకర్త వెంకన్న చౌదరికి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు. శిరీషను ఎమ్మెల్యేగా గెలిపించు కుంటామని నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో పూండి క్లస్టర్ ఇన్‌చార్జి పుచ్చ ఈశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, మాజీ సర్పంచ్ సీపాన గోపి, శంకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

హరిపురంలో..

హరిపురం: టీడీపీ పలాస నియోజకవర్గ అభ్యర్థిగా గౌతు శిరీషను పార్టీ అధిష్ఠానం ప్రకటించడంపై మందస మండలంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. ఈ మేరకు శుక్రవారం హరిపురం పార్టీ కార్యాలయంలో నాయకులు భైరిశెట్టి గున్నయ్య, పుల్లా వాసు ఆధ్వర్యంలో మిఠాయిలు పంచి, బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. ఐదేళ్లుగా పార్టీకి, కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలిచిన శిరీషను ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపుతామని ప్రతినబూనారు. కార్యక్రమంలో నాయకులు కొత్ర వైకుంఠరావు, కనగల తేజ, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు: మాజీ మంత్రి గౌతు శివాజీని అభినందిస్తున్న టీడీపీ నేతలు



హరిపురంలో మిఠాయిలు పంచిపెడుతున్న నాయకులు

టీడీపీ హయాంలోనే సంతబొమ్మాళి అభివృద్ధి



సంతబొమ్మాళిలో అవగాహన కలిగిస్తున్న టీడీపీ నాయకులు

సంతబొమ్మాళి: టీడీపీ ప్రభుత్వ హయాలోనే సంత బొమ్మాళి గ్రామం అభివృద్ధి చెందిందని ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. శుక్రవారం సంతబొమ్మాళిలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు సంతబొమ్మాళి గ్రామాన్ని దత్తత తీసుకోవడంతో పాటు ఎమ్మెల్యే అచ్చెన్నా యుడు తన సొంత గ్రామం కన్నా ఎక్కువగా అభివృద్ధి చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కూశెట్టి కాంతారావు, మెండ అప్పారావు, ముద్దపు లచ్చన్న, అల్లు రమేష్,సూరాడ ధనరాజ్, సువ్వారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోమటూరులో బాబు ష్యూరిటీ

నందిగాం: నర్సిపురం పంచాయతీ కోమటూరులో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు ప్రజలకు అందించి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో నేతలు ఎం.బాలకృష్ణ, సింహాచలం, ఎన్.నాగరాజు, బి.గిరిబాబు, ఎస్.తిరుపతిరావు, కె.ప్రసాద రావు, కె.ధర్మారావు, ఎం.పద్మావతి, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నందిగాం: కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఉమ్మడి ప్రభుత్వంతో రాష్ట్రాభివృద్ధి

జలుమూరు, (సారవకోట): టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వంతో రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రతినిధి ధర్మాన తేజ కుమార్ అన్నారు. మాళువ పంచాయతీ సవర మాళువ గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కలిగించారు. వైసీపీ ప్రభుత్వం రాజధాని లేని రాష్ట్రంగా తయారు చేసిందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురవరపు తిరుపతిరావు, సురవరపు అప్పలనాయుడు, మామిడి ఆనంద, మురళీ, డి.జయరాం, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



సవర మాళువలో భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహిస్తున్న తేజకుమార్

శిలాఫలకాలు మూశారు



ఎంపీడీవో కార్యాలయంలో శిలాఫలకానికి పేపర్లు అతికించిన దృశ్యం

నందిగాం: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండలం లోని పలు కూడళ్లలో ఉన్న శిలాఫల కాలకు మూసి వేశారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'కోడ్ వర్తించదా' శీర్షికతో వచ్చిన కథనానికి మండ ల కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారి జి.శివ ప్రసాద్ స్పందించారు. మండల పరిషత్, వెలుగు, ఎమ్మార్సీ కార్యాలయాల ఆవరణలో ఉన్న శిలాఫలకాలపై పేపర్లు అంటించారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

జలుమూరు (సారవకోట): వేసవిలో ఏ గ్రామంలోను తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసు కోవాలని ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో ఎం.రాంబాబు మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ భాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలి

జలుమూరు: ఎన్నికలు కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలను పక్కాగా అమలుచేయాలని పర్యవేక్షణాధికారి కృష్ణారావు అన్నారు. రాణ, హుస్సేనుపురం, చిన్నదూగాం గ్రామ సచివాలయాలను శుక్రవారం సందర్శించారు. ఉద్యోగులు రాజకీయపార్టీల ర్యాలీలు, ప్రచారాల్లో పాల్గొనకూడదన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ



మొక్క నాటుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

హరిపురం: మొక్కలతోనే మానవాళి మనుగడ సాధ్యమని ప్రిన్సిపాల్ బి.శివ అన్నారు. మందస మండలం బి.కేసుపురం గ్రామంలో శాతవాహన విద్యా సంస్థల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శుక్రవారం మొక్క లను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలను నాటడంతో పాటు వాటిని పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు శాంతారావు, రామ్‌కుమార్, దుదిష్టినాయుడు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వినియోగించాలి

నరసన్నపేట: నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని నేచురల్ సొసైటీ అధ్యక్షుడు లుకలాపు రంజిత్ అన్నారు. రెడ్డికపేట పాఠశాలల్లో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోటీ నిర్వహించి బహుమతులను అంద జేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.జ్యోతి, సొసైటీ సభ్యుడు పోగోటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళా శాల విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న తహసీల్దార్ సుధాకర్

హిరమండలం, మార్చి 22: ఓటు విలువను గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుధాకర్ అన్నారు. శుక్రవారం తంప గ్రామంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఏప్రిల్ 15వ తేదీలో ఓటు నమోదుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమలలో ఈవో నర్సింగరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

జగన్నాథపురం(ఎల్.ఎన్.పేట): సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని తహసీ ల్దార్ రాణి అమ్మాజీ, ఎంపీడీవో జి.గిరిబాల తెలిపారు. జగన్నాథపురంలో శుక్రవారం ఓటుహక్కు వినియోగాంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఓటర్లచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్ఐ గవరయ్య, రెవెన్యూ కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ● **సంతబొమ్మాళి:** ఓటు హక్కు వజ్రాయుధమని, ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించు కోవాలని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం నౌపడ, సీతానగరం, ఇజ్జువరం గ్రామాల్లో ఓటర్లకు అవగాహన నిమిత్తం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ● **పాతపట్నం:** ఓటుహక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని వెలుగు ఏపీఎం మనోరత్నం అన్నారు. మండలంలోని సోద, సీది, రంకిణి గ్రామాల్లో వెలుగు ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య సభ్యులకు ఓటుహక్కుపై అవగాహన సదస్సు, ర్యాలీలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో సీసీ ఎస్.శ్రీధర్, ప్రభావతి, అప్పలస్వామి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. ● **వజ్రపుకొత్తూరు:** ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని మండల మహిళాసమాఖ్య సభ్యులు పేర్కొన్నారు. స్వీప్‌లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీసీలు, సీఏఫ్‌లు పాల్గొన్నారు. ● **నందిగాం:** మండలంలోని పలు గ్రామాల్లో ఓటుహక్కు వినియోగంపై శుక్రవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. వెలుగు ఆధ్వర్యంలో పెద్ద బాణాపురం, పాత్రునివలస, దిమ్మిడిజోల, భర్తుపురం, జయపురం, సొంటినూరు, పెద్ద గురు వూరు తదితర గ్రామాల్లో ఏపీఎం జాంబవతి నేతృత్వంలో అవగాహన కలిగించారు. కార్య క్రమంలో సీసీలు హరిప్రియ, నీలవేణి, లీలావతి, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం: పేడాడ



బోరుభద్ర శివాలయంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంతబొమ్మాళి: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు అన్నారు. శుక్రవారం బోరుభద్ర శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంలోనే జరిగాయని గుర్తు చేశారు. పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల బాధ్యతలు స్వీకరించిన తరు వాత పార్టీ బలోపేతమైందన్నారు. కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు చింతాడ దిలీప్ కుమార్, కోత మధుసూదనరావు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల్లో అసంతృప్తి

హిరమండలం/మెళియాపుట్టి/ఎల్ఎన్‌పేట/పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గం టీడీపీ అసెంబ్లీ అభ్యర్థిగా మామిడి గోవిందరావును అధిష్ఠానం ప్రకటించడంతో శుక్రవారం ఆ పార్టీలోని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ వర్గీయులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు పలు మండలాల నాయకులు పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు. ఐదేళ్లుగా పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేసిన కలమటను కాదని గోవిందరావుకు టికెట్ ఇవ్వడం అన్యాయమని వారు వాపోయారు. పార్టీ నిర్ణయాన్ని పునః సమీక్షించుకుని కలమటకు టికెట్ కేటాయించాలని లేకుంటే తామంతా పార్టీ పదవులకు రాజీనామా చేస్తామని స్పష్టం చేశారు. హిరమండలంలో జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు చెట్టు శ్రీనివాసరావు, సర్పంచ్ దారపు డిల్లేశ్వరరావు, కె.సింహాచలం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ● మెళియాపుట్టిలోనూ కలమట వర్గీయులు అసంతృప్తి వ్యక్తంచేశారు. తామంతా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు భాస్కరగౌడ్, ప్రధాన కార్యదర్శి ఉర్లాన వసంత్, తెలుగు యువత మండల అధ్యక్షుడు బసవ పరమేశ్వరరెడ్డి తదితరులు ప్రకటించారు. ● పాతపట్నంలోనూ కలమటకు మద్దతుగా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పలువురు నేతలు ప్రకటించారు. గోవిందరావుకు టికెట్ ప్రకటనతో పార్టీ నేతల మనోభావాలు దెబ్బతిన్నాయని బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైల లక్ష్మయ్య తెలిపారు. పార్టీ పట్టణాధ్యక్షుడు సైలాడ సతీష్, మాజీ ఎంపీటీసీ కనకల నారాయణ, జిల్లాకార్య నిర్వాహక కార్యదర్శి కర్రి అప్పారావుతో పాటు పలువురు నేతలు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ● ఎల్ఎన్‌పేటలోనూ పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, పునరాలోచన చేయాలని నేతలు కోరారు. లేకుంటే మూకుమ్మడిగా నిర్ణయం తీసుకుంటామని పార్టీ మండల అధ్యక్షుడు ఎం.మనోహర్‌నాయుడు, ఆనంద రావు, సీహెచ్ శ్రీనివాసరావు, టి.అప్పన్న, ఎం.శ్రీనివాసరావు తదితరులు స్పష్టంచేశారు.

నిబంధనలు పక్కాగా పాటించాలి



టెక్కలి: సార్వత్రిక ఎన్నికల్లో నిబంధనలను పక్కాగా పాటించాలని టెక్కలి ఆర్వో, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ సూచించారు. శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తప్పవన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా ర్యాలీలు, సమావేశాలకు అనుమతులు కావాలంటే దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల వ్యవహారాలకు సంబంధించి ఆయా రాజకీయ పార్టీల కార్యక్రమాలపై పలు బృందాలు నిఘా ఉంటుందన్నారు. సమావేశంలో బగాది శేషగిరి (టీడీపీ), ఇతర పార్టీల నేతలు పినకాన వైకుంఠరావు, సిగిలిపల్లి మోహనరావు, బూరె నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నీలమణిదుర్గ ఆలయ ఆదాయం రూ.3.45 లక్షలు

పాతపట్నం: నీలమణిదుర్గ ఆలయానికి 29 రోజులకు గాను రూ. 34,5512 ఆదాయం వచ్చినట్లు ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణం లోని హుండీలను తెరిచి లెక్కించారు. శ్రీకాకుళం ఉమా రుద్రకోటేశ్వరస్వామి ఆలయ ఈవో ఎం.సుకన్య పర్యవేక్షణలో ఆదాయం లెక్కించగా 30.300 గ్రాముల బంగారం, 2.50 కేజీల వెండి లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి అధ్యక్షుడు నూలు ఈశ్వరరావు, అర్చకులు సంతోష్‌కుమార్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక

నరసన్నపేట: నరసన్నపేట బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జామి కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా జీవీ రమణ, ప్రధాన కార్యదర్శిగా జీవీజీ నాయుడు, సహాయ కార్యదర్శిగా వాన శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను న్యాయాధికారి హరిప్రియ, బార్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

ఐతమ్‌లో రక్తదాన శిబిరం

టెక్కలి: ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం రెడ్‌క్రాస్, జీజీహెచ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ వైద్యులు కె.శ్రీనివాస్, జ్యోత్స్న, రాణి పాల్గొని విద్యార్థుల నుంచి రక్తం సేకరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, డీన్ విష్ణుమూర్తి, ఎన్ఎస్ఎస్ పీవో బలరాం తదితరులు పాల్గొన్నారు.

యువత భవితను చిదిమేస్తున్న జగన్ డ్రగ్ మాఫియా

- డ్రగ్స్ కుంభకోణం వెనుక తాడేపల్లి ప్యాలెస్ హస్తం
- యువతను మత్తులో ముంచి రాష్ట్రం లూటీ
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

అరసవల్లి: ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రాజధానిగా మార్చి యువత భవితను జగన్ రెడ్డి డ్రగ్ మాఫియా చిదిమేస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో పెట్టుబడుల్లో రాష్ట్రం మొదటి స్థానంలో ఉంటే... ప్రస్తుతం గంజాయి, డ్రగ్ రవాణాలో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి జగన్‌రెడ్డి చేర్చారని తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం ఆయన స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఎందుకు బ్రెజిల్ దేశాధ్యక్షునికి ట్వీట్ చేశారని ప్రశ్నించారు. బ్రెజిల్ నుంచి విశాఖకు వచ్చిన కంటెయినర్‌లో మార్ఫిన్, కొకైన్, హెరాయిన్ వంటి భయంకర మత్తు పదార్థాలు ఉన్నాయని సీబీఐ తన నివేదికలో పేర్కొందని తెలిపారు. ఈ డ్రగ్స్ కుంభకోణంలో తాడేపల్లి హస్తం లేకుండా ఎలా జరుగుతుందని నిలదీ శారు. స్థానిక పోలీసులు డ్రగ్స్ సీజ్ చేయడానికి వెళ్లిన సీబీఐ అధికారులను ఎందుకు తీవ్రంగా ప్రతిఘటించారని ప్రశ్నించారు. 16వ తేదీన కంటెయినర్ వస్తే 20 వరకు సీబీఐ అధికారులను నిలువరించడంలో పరమార్థం ఏమిటని రవికుమార్ నిలదీశారు. ఇప్పుడు ఏకంగా రూ.50వేల కోట్ల విలువైన భయంకర డ్రగ్స్ ఉన్నాయని సీబీఐ తన నివేదికలో పేర్కొందన్నారు. బ్రెజిల్ నుంచి మత్తుపదార్థాలు దిగుమతి చేస్తున్నారని తెలిసే జగన్‌రెడ్డి తన అధికారులను పంపారా అని సందేహం వెలిబుచ్చారు. కూనం వీరభద్రరావు కరోనా సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.50 లక్షలు విరాళం ఇచ్చాడని... విజయసాయిరెడ్డికి అతను ఆప్తుడని అన్నారు. డ్రగ్స్ దిగుమతి జరిగిన రోజు బ్రెజిల్ అధ్యక్షునికి విజయసాయిరెడ్డి ట్వీట్ చేయడం ఆశ్చర్యకరమన్నారు. జగన్‌రెడ్డికి సంబంధం లేకుండా ఎవరైనా ఇంత స్థాయిలో డ్రగ్స్ వ్యాపారం చేసే అవకాశం రాష్ట్రంలో ఉందా అని ప్రశ్నించారు. విశాఖను డ్రగ్స్ మాఫియాకు కేంద్రంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని... అందుకే జగన్‌రెడ్డి మకాం ఇక్కడికి మారుస్తున్నానని చెబుతున్నాడని అన్నారు.

అందరిచూపు సైకిల్‌పై ఉండాలి..

ఆమదాలవలస: రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ జనసేన మూడు పార్టీల పొత్తుతో వైసీపీ చిత్తు కావాలని...అందరి చూపు సైకిల్ వైపు ఉండాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో శుక్రవారం టీడీపీ, బీజేపీ, జనసేన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న తనను గెలిపించాలని కోరారు. ఎన్‌డీఏ కూటమి విజయం అవసరమన్నారు. ఈ


ఆమదాలవలస: సమావేశంలో మాట్లాడుతున్న కూన రవికుమార్

సమావేశంలో జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్ర మోహన్, నియోజకవర్గ కన్వీనర్ పేడాడ రామ్మోహన్, ఆమదాలవలస బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పేడాడ సూరపునాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, ఇరు పార్టీల నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, పైడి మురళీమోహన్, నూకరాజు, సనపల ఢిల్లేశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్, బోర గోవిందరావు, శివ్వాల సూర్యనారాయణ, కిల్లి సిద్ధార్థ, తదితరులు పాల్గొన్నారు.

నీటి చౌర్యానికి పాల్పడితే కొళాయిలు తొలగిస్తాం

శ్రీకాకుళం అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 50 డివిజన్లలో ప్రజలు తమ కొళాయిలకు మోటార్లు తగిలించి నీటి చౌర్యానికి పాల్పడితే అటువంటి వారి ఇళ్లకు శాశ్వతంగా కొళాయిలు తొలగిస్తామని కమిషనర్ తమీమ్ అన్సారియా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రకటన విడుదలైన నాటి నుంచి 7 రోజులలో నగరపాలక సంస్థ సిబ్బంది మొదటిసారి గుర్తిస్తే రూ.2 వేల అపరాధ రుసుం, రీకనక్షన్ కోసం రూ.250 నగర పాలక సంస్థ ఖజానాకు చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ అన్సారియా చెప్పారు. రెండోసారి దొరికితే శాశ్వతంగా కొళాయిలను తొలగిస్తామని స్పష్టం చేశారు.

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్: రాజకీయ పార్టీల ప్రచారాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాత్కాలికంగా పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసినా... ప్రచారాలకు వినియోగించే వాహనాలకు, వీధుల్లో నిర్వహించే సమావేశాలకు లౌడ్ స్పీకర్స్, సభావేదిక/ బారి కేడ్లు ఏర్పాటు చేసినా, వాహనాలు, ఇంటింటి ప్రచారాలు, ర్యాలీలకు అనుమతులు తీసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు ఒక వాహనానికి అనుమతి తీసుకుంటే ఆ నియోజకవర్గంలో తిరగడానికి ఆ వాహనాన్ని మాత్రమే వినియోగించాలన్నారు. లౌడ్‌స్పీకర్లతో ఉన్న వాహనాలకు, కరపత్రాల పంపిణీకి, బ్యానర్లు, పార్టీ జెండాలు పెట్టేందుకు, పోస్టర్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలన్నా అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో అనుమతులు కావాలంటే 48 గంటల ముందు సువిధ యాప్‌లోగానీ ఆఫ్‌లైన్‌లో అయితే సంబంధిత రిటర్నింగ్ అధికారికి గానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

కంచిలి: కంచిలి మండల కేంద్రంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో శనివారం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ఎంవీకేఎస్ రవి ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు ఈ శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు.

వేలం పాటల ఖరారు

ఇచ్ఛాపురం: 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మున్సిపల్ వేలం పాటలు ఎట్టకేలకు ఖరారయ్యాయి. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎన్.రమేష్ అధ్యక్షతన డైలీ మార్కెట్ వీధి గుత్త, కమేళా ఆశీలు వసూలుకు నలుగురు పాటదారులు పాల్గొన్నారు. డైలీమార్కెట్, వీధి గుత్తలు దాట్ల నూకమ్మ రూ. 30లక్షల 50వేల 555కి సొంతం చేసుకున్నారు. కమేళా వేలం పాటను తిప్పన రమణయ్యరెడ్డి రూ.2లక్షల707కు సొంతం చేసుకున్నాడు.

తమ్మినేని చీకటి ఒప్పందాలను బయటపెడతా

బూర్జ: తమ్మినేని సీతారాం చీకటి ఒప్పందాలను ఆధారాలతో సహా తొందరలోనే బయట పెడతానని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. శుక్ర వారం బూర్జ గ్రామంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. మామ, అల్లు ళ్లను గెలిపించినంత కాలం నియోజకవర్గం అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా ఉంటుందన్నారు. మామ, అల్లుళ్ల చరిత్ర ప్రజలందరికీ తెలుసని అన్నారు. ప్రతి ఎన్నికల్లోనూ ఇద్దరూ కలిసి తెరవెనుక చీకటి ఒప్పందాలను చేసుకొని తీరా ఎన్నికలయ్యాక లావాదేవీలను సరిచేసుకొని చెక్కబెట్టుకుంటారన్నారు. అనిల్‌కుమార్, ప్రశాంత్, మోహన్‌చౌదరి, ఆదినారాయణ, రవి, బగాది మోహన్, గోపాల్, జనార్దన్, జగ్గుపల్లి మధు, తులసి పాల్గొన్నారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించండి

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం

పొందూరు: సుదూర ప్రాంతాల నుంచి పదో తరగతి పరీక్షలు రాసేందుకు వచ్చే విద్యార్థులకు కేంద్రాలలో తాగునీరు, వైద్య సౌకర్యంతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అధికారులను ఆదేశించారు. కింతలి, తాడివలస పరీక్ష కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. పరీక్ష కేంద్రాలపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంఈవో పీవీ రామరాజు, అధికారులు ఉన్నారు.

శ్రీకూర్మనాథుని సన్నిధిలో మంత్రి

గార: శ్రీకూర్మనాథుడిని శుక్రవారం సాయంత్రం మంత్రి ధర్మాన ప్రసాదరావు దర్శించుకున్నారు. స్వామి వారి సన్నిదిలో పూజలు చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.హర్షవర్ధన్ కూడా శ్రీకూర్మనాథుని దర్శించుకున్నారు. వీరికి స్వామి వారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని ఆలయ ఈఓ గురునాథరావు అందజేశారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఇద్దరు విద్యార్థులు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘ అధ్యక్షులు కలిదిండి నరసింహరాజు, కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి తెలిపారు. ఈ విద్యార్థులను సంఘ కన్వీనర్ కె.వెంకటరామరాజు, చైర్మన్ బి.హరిధర్, ఉపాధ్యక్షులు ఎం.తిరుపతిరావు, జిల్లా పీఈటీ , పీడీల సంఘం అధ్యక్షులు ఎం.వి.రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సిఈవో పి.సుందరరావు తదితరులు అభినందించారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి పోరాటాలే శరణ్యం

అరసవల్లి: ఉత్తరాంధ్రలో సహజ వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ అభివృద్ధి చెందలేదంటే అందుకు కారణం పాలకుల నిర్లక్ష్యమేనని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా నినాదంతో 'ఉత్తరాంధ్ర అభివృద్ధి-యువత పాత్ర' అనే అంశంపై ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా అప్పలనాయుడు, రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో సుదీర్ఘ సముద్రతీరం, అటవీ ప్రాంతం, 19 ఉపనదులు ఉన్నప్పటికీ అభివృద్ధి చెందకపోవడం దారుణమన్నారు. నీటి వనరులు పుష్కలంగా ఉన్నా వ్యవసాయం లాభదాయకంగా లేదంటే అందుకు కారణం ప్రాజెక్టులను పూర్తి చేయకపోవడమే అని విమర్శించారు. ఇప్పటికైనా పాలకులు పట్టించుకోకుంటే పోరాటాలే శరణ్యమని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడ చూసినా వలస కూలీలుగా ఉత్తరాంధ్ర వాసులు ఉంటున్నారని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, ఏఐవైఎఫ్ ప్రతినిధి మొజ్జాడ యుగంధర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణరావు, ఏఐవైఎఫ్ విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న, గోపీ నాయుడు, వాసు, సీహెచ్ రవి తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి వేతనాలు వెంటనే చెల్లించాలి

సరుబుజ్జిలి: ఉపాధి వేతనదారులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, జిల్లా ఉపాధ్యక్షులు గంగరాపు ఈశ్వరమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సరుబుజ్జిలి మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి వేతనదారులకు ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. అధికారులు వెంటనే స్పందించి వేతనాలు అందించాలన్నారు. సమావేశంలో రాకోటి ఫల్గుణరావు, ఎండ ఆదిలక్ష్మీ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

సోంపేట: సుంకిడి, రాజాం, కర్తలిపాలెం గ్రామాల్లో వెలుగు ఆధ్వర్యంలో శుక్రవారం ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వీవీ రమణమ్మ, సీసీలు రాణి, ధనలక్ష్మి, ఎం.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


గోకర్ణపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

పొందూరు: మండలంలోని వివిధ గ్రామాలలో గల పోలింగ్ కేంద్రాలను ఎస్పీ జి.రాధిక శుక్రవారం పరిశీలించారు. గోకర్ణపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ.. ఎన్నికలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ వై.రవికుమార్‌ను ఆదేశించారు. ఎన్నికలకు ఆటంకం కలిగించే వారిని ముందే గుర్తించి.. బైండోవర్ కేసులను నమోదు చేయాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై నివేదిక తయారు చేయాలన్నారు. ఎస్పీతో పాటు శ్రీకాకుళం డీఎస్పీ శృతి, ఎస్ఐ రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

వైభవంగా ఆదిత్యుని డోలోత్సవం


స్వామి వారికి తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి డోలోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం కామ దహనోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఉషా, పద్మిని, ఛాయా సమేత శ్రీ సూర్య నారాయణ స్వామివారి ఉత్సవమూర్తులకు మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాట నృత్యాలతో వైభవంగా తిరువీధి మహోత్సవం నిర్వహించారు. అనంతరం చిన్నతోటలో స్వామివారికి విశేష అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి మండపం వద్ద పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం కామదహనోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నేతింటి హరిబాబు, ఇప్పిలి రంజిత్‌శర్మ, ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాస వర్మ, రామకృష్ణ శర్మ, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఈఎస్ చక్రవర్తి, ఆలయ సిబ్బంది, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీకూర్మంలో కామదహనోత్సవం..

గార: ప్రసిద్ధిచెందిన శ్రీకూర్మనాథుని డోలోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన కామదహనోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తులకు మేళతాళాలతో తిరువీధి నిర్వహించి గ్రామ సమీపంలోని కామదహన మండపం వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ ప్రధాన అర్చకులు సీతారామ నర్సింహాచార్యులు తదితరులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని ఆరాధన, ప్రత్యేక హోమం చేశారు. కామునికి గుర్తుగా ముందుగా సిద్ధం చేసిన కొబ్బరి కమ్మకు పవిత్ర జలంతో శుద్ధి చేశారు. దానిని దహనం చేశారు. తరువాత స్వామి తిరువీధి నిర్వహించారు. ఈవో జి.గురునాథరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సి.ఐ. ఎల్.ఎస్.నాయుడు, గార ఎస్.ఐ. కె.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. స్థానిక పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


కూర్మనాథుని తిరువీధిలో పాల్గొన్న భక్తులు

ఆర్టీసీ ఎండీని కలిసిన ఎస్పీ


ఆర్టీసీ ఎండీ తిరుమలరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైం: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ డి.తిరుమల రావును జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ జీఆర్ రాధిక మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని ఆయన అందుకున్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత

పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కె.సురేష్‌బాబు కుటుంబానికి మంజూరైన అడిషనల్ కార్పస్ ఫండ్ రూ.లక్ష చెక్కును శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాధిక అందజేశారు. కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా పోలీసు శాఖ అండగా ఉంటుందని ఎస్పీ భరోసానిచ్చారు.

ఆమదాలవలస: బూర్జ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన కానిస్టేబుల్ సురేష్ కుటుంబానికి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దివాకర్ యాదవ్ శుక్రవారం ఆర్థిక సాయాన్ని అందించారు. సర్కిల్‌లోని ఉన్న పోలీసులందరి నుంచి విరాళాలు సేకరించి మృతుని భార్యకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజర్స్ మేనేజ్‌మెంట్ వినియోగాన్ని విస్తృత పరచాలి


- ఎన్నికల విధుల్లో ఉండే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ తదితరులు

కలెక్టరేట్: సీజర్స్ అంశంపై సీఎస్, డీజీపీలతో భారత ఎన్నికల సంఘం అధికారులు ఏప్రిల్ 3వ తేదీన సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఎలక్ట్రానిక్ సీజర్స్ మేనేజ్‌మెంట్ సిస్టం వినియోగాన్ని విస్తృత స్థాయిలో మెరుగుపర్చాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సీజర్స్ అంశంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలను అప్రమత్తం చేయాలన్నారు. సరిహద్దు ప్రాంతాల్లోనూ నిఘాను పటిష్టం చేయాలని ఆదేశించారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద కనీసం ఒక కెమెరాతో స్టాటిక్ సర్వైలెన్సు బృందాన్ని ఉంచాలన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం దాదాపు 33 నిత్యావసర సేవల శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించాలని ఆదేశించారు. వీరిలో పోలీసు, విద్యుత్తు, రవాణా, పోస్టల్ తదితర శాఖలు ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే మీడియా ప్రతినిధులతో పాటు సంబంధిత ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల కార్యక్రమాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరని స్పష్టం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వాస్తవ నివేదికను వెంటనే తమకు పంపాలని అన్నారు. జిల్లా నుంచి కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, జేసీ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో గణపతిరావు, ఆర్డీవో రంగయ్య, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, సీపీఓ ప్రసన్నలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, డీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, ఆడిట్ అధికారి సుల్తానా పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం

- అదనపు ఎస్పీ గంగాధరం


చెక్‌పోస్టు వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ

ఇచ్ఛాపురం: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని అడిషనల్ ఎస్పీ డి.గంగాధరం అధికారులకు సూచించారు. శుక్రవారం చెక్‌పోస్టును సందర్శించిన ఏఎస్పీ అక్కడి అధికారులతో మాట్లాడారు. వాహనాలను తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. నిషేధిత పదార్థాలు చెక్‌పోస్టుగుండా అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఇమ్మాన్యుయెల్ రాజు, పట్టణ ఎస్ఐ సత్యనారాయణ, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రభుత్వ భూమిని గ్రామ అవసరాలకు కేటాయించాలి


ఆందోళన చేస్తున్న కృష్ణాపురం గ్రామస్తులు

రణస్థలం: ప్రభుత్వ భూమిని గ్రామ అవసరాల కోసం కేటాయించాలని, పట్టాలు మంజూరు చేయొద్దని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు కృష్ణాపురం గ్రామస్తులు నడుపూరి శ్రీను, గొర్లె అప్పలనాయుడు, నడుపూరి రామారావు, సీహెచ్ శ్రీను తదితరులు శుక్రవారం చెప్పారు. గ్రామస్తుల వివరాల మేరకు కృష్ణాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 25- 3లో సుమారు 4. 80 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ ఎకరా సుమారు రూ.2 కోట్లు పలుకుతుంది. దీంతో ఈ భూమి కొంత ఆక్రమణకు గురైంది. ఈ భూమిని గ్రామ అవసరాల కోసం వినియోగించాలని, ఇక్కడ పట్టాలు మంజూరు చేయొద్దని శుక్రవారం కృష్ణాపురం గ్రామస్తులు ఆందోళన చేశారు. విలువైన భూమిని ఒక వ్యక్తికి 53 సెంట్లు కేటాయించడంపై ఆందోళన చేశా రు. దీనిపై వీఆర్వో శారదాబాయిను వివరణ కోరగా.. ఈ భూమిలో 14 మందికి పట్టాలు మంజూరు చేసినట్టు తెలిపారు. అదనంగా ఆక్రమిస్తే తొలగిస్తామన్నారు.

గొండు శంకర్ విజయం తథ్యం

- అభినందించిన టీడీపీ నాయకులు


గొండు శంకర్‌ను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

గార: శ్రీకాకుళం నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉమ్మడి జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షుడు గొండు శంకర్‌కు పార్టీ అధిష్ఠానం టికెట్ ప్రకటించడంపై శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం గార టీడీపీ నాయకులు గొండు శంకర్‌ను కలిసి అభినందించారు. ఎ.ఎం.సి. మాజీ చైర్మన్ పీస వెంకట రమణ మూర్తి, గార మాజీ సర్పంచ్ బడగల వెంకటఅప్పారావు, నాయకులు మైగాపు ప్రభాకరరావు, వి.ఎస్.గిరి, గుండ భాస్కరరావు, జి.వి.రమణమూర్తి, కొంక్యాన ఆదినారాయణ, కొంక్యాన రమణమూర్తి తదితరులు గొండు శంకర్‌ను దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గొండు శంకర్ విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

మెరైన్ ఏఎస్ఐకి పురస్కారం

గార: కళింగపట్నం మెరైన్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ బి.జగన్మోహన్‌రావు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. గతంలో కూడా ఆయన పలు పురస్కారాలు అందుకున్నారు. 1989 బ్యాచ్‌కు జగన్మోహన్‌రావు ఉత్తమ పురస్కారానికి ఎంపిక కావడంపై మెరైన్ పోలీసు స్టేషన్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్షయ వ్యాధి నివారణకు సహకరించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మీనాక్షి

అరసవల్లి: జిల్లాలో క్షయ వ్యాధి నివారణకు అందరూ సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బొడే ్డపల్లి మీనాక్షి పిలుపునిచ్చారు. ఈ నెల 24న నిర్వహించ నున్న ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించు కుని శుక్రవారం ఆమె జిల్లా టీబీ కంట్రోల్ అధికారి ఎం. ప్రసాదరావుతో కలిసి మాట్లాడారు. క్షయ అంటువ్యాధి అని, మైకో బాక్టీరియా ట్యూబర్‌క్యులోసిస్ అనే సూక్ష్మజీవి ద్వారా సంక్రమిస్తుందని చెప్పారు. రెండు వారాలకు మిం చి దగ్గు, ఆయాసం, సాయంకాలం జ్వరం, బరువు తగ్గ డం, కఫంలో రక్తం పడడం, రాత్రి నిద్రలో చెమట పట్ట డం వంటివి ఈ రోగ లక్షణాలని తెలిపారు. గత ఏడాది జిల్లాలో 3,540 కేసులు గుర్తించామని.. వాటిని పూర్తిగా తగ్గించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రతి 2.5 లక్షల జనాభాకు ఒక టీబీ యూనిట్, ఏజెన్సీ ప్రాం తంలో 1.5 లక్షల జనాభాకు ఒక యూనిట్ ఏర్పాటు చేశా మన్నారు. జిల్లాకు 33 ఆర్‌టిపిసిఆర్ మెషిన్లను మంజూరు చేశారని... వీటి ద్వారా మొండి టీబీని కేవలం 2 గంటల్లో నిర్ధారించవచ్చన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితులకు టీబీ సోకే అవకాశాలు అధికమని, ఈ రోగులు ఎక్కువగా క్షయ వ్యాధితో మరణిస్తున్నారని అన్నారు. షుగర్, కేన్సర్ పేషెంట్లు, స్టెరాయిడ్స్ వాడేవారు, ఆల్కహాల్ తాగేవారు తొందరగా ఈ వ్యాధి బారిన పడతారని ఆమె తెలిపారు.

భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలి


మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ రజని

ఎచ్చెర్ల: న్యాయ శాస్త్రం అభ్యసిస్తున్న విద్యార్థులు భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలోని న్యాయ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ న్యాయ విద్యను పూర్తి చేసి న తర్వాత సమాజానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, న్యాయ శాస్త్రం కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ వై.రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు జేకేఎల్ సుజాత, జి.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

సరుబుజ్జిలి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా కవాతు నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక గ్రామాలైన తెలికిపెంట, కూన జమ్మన్నపేట గ్రామాల్లో శుక్రవారం ఎస్ఐ బి.నేహార ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. పోలీస్ బృందంతో పాటు ఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

గార: బూరవెల్లిలో శుక్రవారం సాయంత్రం పోలీసులు కవాతు నిర్వహించారు. గార ఎస్.ఐ. కె.కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర పోలీసు దళం పాల్గొంది.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

ఇచ్ఛాపురం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం ప్రసాద్ అన్నారు. శుక్రవారం లొద్దపుట్టి, కేశుపురం గ్రామాల్లో మహిళా సమాఖ్య సభ్యులతో సభలు ఏర్పాటు చేసి ఓటు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వివిధ యాప్‌లను ఎలా వినియోగించుకోవాలో ఓటర్లకు వివరించారు.

టీడీపీ నేతల అసంతృప్తి

- శ్రీకాకుళం, పాతపట్నంలో టీడీపీ ఇన్‌చార్జి వర్గాల ఆందోళన

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)


పార్టీ శ్రేణులను సముదాయిస్తున్న గుండ లక్ష్మీదేవి


స్టిక్కర్లు తొలగిస్తున్న దృశ్యం

తెలుగుదేశం పార్టీలో సీట్లు ఆశించి భంగపడిన వారి అనుచరులు ఆందోళనకు దిగారు. శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు గుండ లక్ష్మీదేవి, కలమట వెంకటరమణలు టిక్కెట్లు ఆశించారు. కానీ ఈ దఫా శ్రీకాకుళం నుంచి గొండు శంకర్‌కు, పాతపట్నం నుంచి మామిడి గోవిందరావుకు టిక్కెట్లు కేటాయించారు. దీంతో శ్రీకాకుళంలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి ఇంటి ముందర టీడీపీ శ్రేణులు నిరసనకు దిగాయి. 30 ఏళ్ల నుంచి టీడీపీలో కొనసాగుతున్న గుండ కుటుంబానికి కాకుండా.. మరొకరికి టిక్కెట్ కేటాయించడంపై అనుచరులు భగ్గుమన్నారు. గార, శ్రీకాకుళం, శ్రీకాకుళం రూరల్ మండలాలకు చెందిన గుండ దంపతుల అనుచరవర్గం టీడీపీ ప్రచార సామగ్రిని దహనం చేసి ప్రచార రథంపై ఉన్న టీడీపీ స్టిక్కర్లను తొలగించారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేయాల్సిందేనని.. తాము గెలిపించుకుంటామంటూ అప్పలసూర్యనారాయణ, లక్ష్మీదేవి ముందర డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గుండ దంపతులు.. కార్యకర్తలను నివారిస్తూ.. పార్టీ ఆదేశాలను ఏనాడూ తాము తప్పలేదని వారు వెల్లడించారు. కార్యకర్తలు, ప్రజల అభీష్టం మేరకు ప్రశాంతంగా ఆలోచించి నిర్ణయం తీసుకుందామని స్పష్టంచేశారు. అనంతరం టీడీపీ నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, టీడీపీ అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, యువత అధ్యక్షులు నాగార్జున ప్రతాప్, గార మండల టీడీపీ నాయకులు జల్లు రాజీవ్ తదితరులు మాట్లాడుతూ టిక్కెట్ కేటాయింపులపై పార్టీ అధిష్ఠానం పునఃపరిశీలించాలని కోరారు. అలాగే పాతపట్నంలో టీడీపీ జడ్పీటీసీ పోగిరి బుచ్చిబాబు, టీడీపీలోని ఓ వర్గం నాయకులు ఆందోళన బాట పట్టారు. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌ఛార్జి కలమట వెంకటరమణకు టిక్కెట్ ఇవ్వకుండా.. మామిడి గోవిందరావుకు కేటాయించడంపై నిరసన వ్యక్తం చేశారు. తామందరం త్వరలో నిర్ణయం తీసుకుంటామని, రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్లు వెల్లడించారు.